క్లుప్తంగా

సొంత గూటికి బీఆర్ఎస్ కౌన్సిలర్



బీఆర్ఎస్‌లో చేరుతున్న కౌన్సిలర్ గంగాధర్

కోరుట్ల: పది రోజుల క్రితం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన 20వ వార్డు కౌన్సిలర్ గంధం గంగాధర్ బుధవారం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సమక్షంలో మళ్లీ బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ గంధం గంగాధర్ మాట్లాడుతూ కొన్ని ప్రలోభాలు, మాయమాటలకు లొంగి బీఆర్ఎస్‌కు దూరం చేశారని తిరిగి తాను బీఆర్ఎస్‌లోకి రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షుడు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్, కౌన్సిలర్లు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలించిన డీఎస్‌వో



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌వో

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్, తాండ్ర్యాల, చింతకుంట, భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు బుధవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం కుప్పలు, తూకం వేసిన వాటి వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తూకంలో జాప్యం చేయవద్దని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సీఈవోలు అరుణ్, విజయ్, రైతులు ఉన్నారు.

అదనపు ఎస్పీని కలిసిన గ్రంథాలయ మాజీ చైర్మన్



జగిత్యాలరూరల్: జగిత్యాల అదనపు ఎస్పీ వినోద్‌కుమార్‌ను బుధవారం జగిత్యాల జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపికను అందజేశారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

కథలాపూర్: మండలంలోని చింతకుంట శివారులో రామాలయం గుట్టపై శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. గుట్టపై ప్రతిష్ఠించిన అభయాంజనేయస్వామిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఈ ఉత్సవాల్లో ఇనుమడుగు ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరి తీర్థస్వామి, గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

అల్లీపూర్ శివారులో వెలిసిన రాములవారి పాదాలు



పూజలు చేస్తున్న గ్రామస్తులు

రాయికల్: మండలంలోని అల్లీపూర్–సింగరావుపేట గ్రామాల మధ్య బుధవారం రాములవారి పాదాలు వెలువగా ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలె శోభారాణి, మురళీ, లవన్, వేముల సతీశ్, వేణురావు, రాజేందర్, పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

ధర్మపురి: అగ్నిమాపక వారోత్సవాలు బుధవారం మూడో రోజుకు చేరాయి. వారోత్సవాల్లో భాగంగా ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరినపుడు అగ్నిమాపక పరికరాలను ఏ విధంగా వినియోగించాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. మంటల్ని ఎలా ఆర్పాలో చేసి చూపించారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ లక్ష్మీనారాయణ, ప్రవీణ్‌రావు, సిబ్బంది తదితరులున్నారు.



జగిత్యాలటౌన్: సీతారాముల కల్యాణానికి హాజరైన భక్తులు



కోదండ రామాలయంలో స్వామి వారి కల్యాణం



మేడిపల్లి: స్వామి కల్యాణానికి హాజరైన ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

ఘనంగా రాములోరి కల్యాణం..

జగిత్యాలటౌన్/కోరుట్ల/కోరుట్ల రూరల్/మెట్‌పల్లి/మెట్‌పల్లిరూరల్ /రాయికల్/మల్లాపూర్/బుగ్గారం/మేడిపల్లి/సారంగాపూర్/ఇబ్రహీంపట్నం: శ్రీరామ నవమిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు.భక్తులు ఆలయాలకు తరలివచ్చి స్వామి వారి కల్యాణం వీక్షించి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా కేంద్రం, పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లోని రామాలయాలు, అంజన్న ఆలయాలు, ఇతర ఆలయాల్లో సీతారాముల కల్యాణం వేద మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని స్వామివారి కల్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణ మహోత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, అర్చకులు, భక్తులు, వివిధ సేవా సంస్థలు సభ్యులు పాల్గొన్నారు.



పెగడపల్లి మండలం నామాపూర్‌లో స్వామి వారి కల్యాణం



రాయికల్‌లో తాళిబొట్టు చూపుతున్న అర్చకులు



గొల్లపల్లిలో స్వామివారి కల్యాణం



కోరుట్ల పట్టణంలోని శ్రీఅష్టలక్ష్మీ ఆలయంలో..



మెట్‌పల్లిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



బుగ్గారంలో సీతారాముల కల్యాణ వేడుక



వాల్గొండ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో..



జగిత్యాలటౌన్: రాములోరికి లడ్డూ ప్రసాదం సమర్పిస్తున్న వీహెచ్‌పీ నాయకులు



జగ్గాసాగర్‌లో సీతారాముల కల్యాణం



జగిత్యాల రూరల్: చిన్నగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం



రేచపల్లి జగన్నాథస్వామి ఆలయంలో..

వాళ్లు నాటుడు.. వీళ్లు నరుకుడు



భీమారం–వెంకట్రావుపేట గ్రామాల మధ్య విద్యుత్ తీగల కింద పెరిగిన చెట్లు

మేడిపల్లి: విద్యుత్‌శాఖ, పంచాయతీ రాజ్ శాఖల మధ్య సమన్వయలోపంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హరితహారంలో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. వాటి సంరక్షణ లోపంతో నిత్యం ఆయా దారుల వెంట వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భీమారం నుంచి వెంకట్రావుపేట వెళ్లే దారిలో విద్యుత్ తీగల కింద మొక్కలు నాటడంతో అవి ఏపుగా పెరిగి విద్యుత్ తీగలకు కొమ్మలు తాకి కరెంట్ సరఫరాకు ఇబ్బంది అవుతోంది. ఆయా దారుల్లో వీధి దీపాలు వెలుగక దారి మొత్తం చీకటితో నిండి కాలినడకన వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదు. గ్రామస్తులు కొమ్మలు కొట్టి దారి కనపడేటట్లు చేయాలని అనుకున్నా.. చెట్లు నరికితే జరిమానా విధిస్తారని భయపడున్నారు. ఇంతకముందు సర్పంచ్‌లు వీటి సంరక్షణలు చూడగా, ప్రస్తుతం కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు గ్రామాలను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సమన్వయం చేసుకుని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్, అర్బన్ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం గురువారం ఉదయం 9 గంటలకు దేవిశ్రీ గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు. అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు సమావేశానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పార్లమెంట్ ఎన్నికలపై సన్నాహక సమావేశం

ధర్మపురి: పట్టణంలోని శ్రీలక్ష్మీనరసింహ ఏసీ ఫంక్షన్ హాల్ (గోదావరి రెసిడెన్సియల్)లో గురువారం 10 గంటలకు పార్లమెంట్ ఎన్నికలపై సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్‌రాజ్ ఠాగూర్, వివేక్, పార్లమెంట్ అభ్యర్థి వంశీ తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

ఇబ్రహీంపట్నం మండల సర్వసభ్య సమావేశం

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేందర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, సభ్యులు హాజరుకావాలని కోరారు.

అయోధ్య రామునికి స్వర్ణ తిలకం

రాయికల్: మండలంలోని అయోధ్య గ్రామానికి చెందిన స్వర్ణకారుడు ఇల్లెందుల నాగేంద్రచారి బుధవారం 0.70 మిల్లీ గ్రాముల స్వర్ణ తిలకాన్ని అందజేయగా ఆలయ కమిటీ నాయకులు అలంకరించారు. అయోధ్య బాలరామునికి సూర్యకిరణాలు తిలకంగా అందించిన నేపథ్యంలో దీనిని తయారుచేసినట్లు నాగేంద్రచారి తెలిపారు. గ్రామ నాయకులు ఆయనను అభినందించారు.

రేణుకా ఎల్లమ్మ బోనాలు

జగిత్యాలరూరల్: ముంబయ్‌లోని థాణెలో తెలంగాణ గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రేణుకాఎల్లమ్మతల్లికి బోనాలు చేశారు. వజ్రేశ్వరి ప్రాంతంలో బోనాలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ముంబాయ్ గౌడ సంఘం అధ్యక్షుడు గుడాల రమేశ్, పోతుగంటి శ్రీనివాస్, గర్వందుల శంకర్, రాజేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి ఉచితంగా టీ,టిఫిన్



హోటల్ ముందు ఏర్పాటు చేసిన బోర్డుతో లక్ష్మణ్

జగిత్యాలటౌన్: శ్రీరామనవమిని పురస్కరించుకుని రామభక్తుడు లక్ష్మణ్ తన భక్తిని చాటుకున్నాడు. గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామానికి చెందిన జంగ లక్ష్మణ్ 8ఏళ్లుగా జగిత్యాల పట్టణంలోని ధరూర్ క్యాంపు కోదండ రామాలయ సమీపంలో హోటల్ నిర్వహిస్తున్నాడు. శ్రీరామనవమిని సందర్భంగా లక్ష్మణ్ తన కస్టమర్లకు బంపర్ ఆఫర్ ప్రకటించాడు. రాములోరి కల్యాణం సందర్భంగా బుదవారం ఉదయం తన హోటల్‌కు వచ్చిన కస్టమర్లందరికీ అటుకులు చాయ్ ఫ్రీగా అందించాడు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌ను పలువురు అభినందించారు.

ఎన్ఆర్ఐ సెల్ ఖతర్ శాఖ కన్వీనర్‌గా నిజాముద్దీన్

మెట్‌పల్లి: టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ ఖతర్ శాఖ కన్వీనర్‌గా పట్టణానికి చెందిన ఖాజా నిజాముద్దీన్‌ను నియమించినట్లు చైర్మన్ వినోద్‌కుమార్ బుధవారం తెలిపారు. కన్వీనర్‌గా ఖతర్‌లోని తెలంగాణవాసుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిజాముద్దీన్‌ను పలువురు నాయకులు సన్మానించారు.

ఘనంగా ఈద్ మిలాప్



మాట్లాడుతున్న మహ్మద్ సాదిఖ్ అహ్మద్

కోరుట్ల: కోరుట్ల పట్టణంలో జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఈద్ మిలాప్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వక్తలు మహ్మద్ సాదిఖ్ అహ్మద్ మాట్లాడుతూ రంజాన్ మాస ప్రాముఖ్యతను వివరించి, అనంతర కాలంలో అదే ఆధ్యాత్మిక చింతనతో వ్యహరించి చక్కని ఫలితాలు పొందవచ్చన్నారు. ప్రతీ ఒక్కరూ మానవత్వంతో వ్యవహారించేందుకు పవిత్ర గ్రంథం ఖురాన్‌లో ఎన్నో అద్భుత విషయాలు దాగి ఉన్నాయన్నారు. ప్రపంచ శాంతి కోరడమే అన్ని మతాల సారాంశంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, సీపీఐ నాయకులు చెన్న విశ్వనాథం, కౌన్సిలర్లు ఎంబేరి నాగభూషణం, మోర్తాడ్ లక్ష్మీనారాయణ, నాయకులు సుతారి రాములు, కాంగ్రెస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు మచ్చ కవిత, వైద్యులు వేముల ప్రభాకర్, డా. స్వాతి అనూప్‌రావు, జమాతే ఇస్లామీ హింద్ జగిత్యాల అధ్యక్షుడు షేక్ ఇస్‌హాఖ్ అలీ, కాంగ్రెస్ కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వసీం,పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మల్లాపూర్: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండలంలోని వాల్గొండ, సిరిపూర్, చిట్టాపూర్ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ నేతృత్వంలో ఏర్పడిన ప్రజాప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అద్భుతమైన పురోగతిని సాధించేందుకు ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో పీసీసీ ఫిషర్మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, యూత్‌కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ గద్దల భరత్‌రాజ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోమ్ముల చిన్నారెడ్డి, పాల్గొన్నారు.

మొగిలిపేట వీడీసీ చైర్మన్‌గా మహబూబ్‌ఖాన్

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేట గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఎండీ.మహబూబ్‌ఖాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ గ్రామ కులసంఘాల ప్రతినిధులు బుధవారం తెలిపారు. కోశాధికారిగా దండవేణి నర్సయ్య, రైటర్‌గా నిమ్మల నర్సారెడ్డి, దేవాదాయ కమిటీ చైర్మన్‌గా ఎదులాపురం నరేశ్, కోశాధికారిగా గోల్కొండ గంగారెడ్డిలను ఎన్నుకున్నారు. అందరి సహకారంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని మహబూబ్‌ఖాన్ తెలిపారు.

నామినేషన్‌కు జన సమీకరణ చేయాలి

సారంగాపూర్: నామినేషన్ కార్యక్రమానికి భారీ ఎత్తున జన సమీకరణ బాధ్యతను స్థానిక నాయకులే తీసుకోవాలని ఎమ్మెల్సీ, నిజమాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన సారంగాపూర్, కొల్వాయిలోని శ్రీరామాలయాల్లో పూజలు చేశారు. అనంతరం పార్టీ కార్యకర్తలు, నాయకులతో మాట్లాడుతూ ఈనెల 22న నిజామాబాద్‌లో నామినేషన్ వేస్తున్నానని, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల నుండి కనీసం 15వేల మంది తరలివచ్చేలా చూడాలని సూచించారు.

బస్ షెల్టర్ ప్రారంభం

జగిత్యాలరూరల్: మండలంలోని గుల్లపేటలో కొంగరి పెద్ద లింగారెడ్డి–కిష్టవ్వ జ్ఞాపకార్థం వారి కుమారులు నిర్మించిన బస్ షెల్టర్‌ను బుధవారం కాంగ్రెస్ నాయకుడు తాటిపర్తి రాంచంద్రారెడ్డి ప్రారంభించారు. బస్‌షెల్టర్ నిర్మించిన వారిని అభినందించారు.